క్లుప్తంగా

ధైర్య సాహసాలకు మారుపేరు ప్రకాశం పంతులు



సత్తెనపల్లి: ధైర్య సాహసాలకు మారుపేరు టంగుటూరి ప్రకాశం పంతులని సత్తెనపల్లి మండల ప్రత్యేక అధికారి సుధాకర్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు బ్రిటీష్ వారి తుపాకీలకు తన గుండెను చూపారన్నారు. ఆయన ప్రదర్శించిన ఈ ధైర్య సాహసం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అంతేకాక ఉప్పు సత్యాగ్రహంలో కీలక పాత్ర పోషించారన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఏఓ బసవ కుమారి, ఈఓపీఆర్డీ దయాసాగర్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారమే భూరక్షపథకం




పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న భూసమస్యల శాశ్వత పరిష్కారమే వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ఉద్దేశమని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో భూముల రీసర్వే కార్యక్రమంపై అవగాహన గ్రామసభ బుధవారం జరిగింది. తహసీల్దార్ భవానిశంకర్ మాట్లాడుతూ మండలంలో మొదటి విడత సర్వేలో భాగంగా ఆరుగ్రామాల్లో సర్వే ప్రక్రియ జరుగుతుందన్నారు. భూయజమానులు భూములకు సంభందించిన హక్కుపత్రాలు సర్వే నిర్వహించే అధికారులకు అందించాలన్నారు. ఇక నుంచి అన్నీ రికార్డులు డిజిటల్ రూపంలోనే అందుబాటులో ఉంటాయన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆర్ఐ కపిల్‌దేవ్, వీఆర్వో, సర్వేయర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినేలా చూడాలి

ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించిన అధికారుల బృందం

క్రోసూరు: పాఠశాలల్లోని ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనాలు తినేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏజన్సీలు చూడాలని మండల ప్రత్యేక అధికారి పద్మశ్రీ సూచించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేరకు బుధవారం మండలంలో మండల ప్రత్యేక అధికారి ఒక టీంగా, ఎంఈఓ ఒక టీంగా పాఠశాలలను సందర్శించారు. మండల ప్రత్యేక అధికారి పద్మశ్రీ, ఈవోపీఆర్డీ పి. శివరామయ్య క్రోసూరు జెడ్పీపాఠశాలలో మధ్యాహ్న భోజనాల తీరును పరిశీలించారు. భోజనాలకు విద్యార్థులు కొద్దిమంది మాత్రమే హాజరుకావాటాన్ని గుర్తించి కారణాలు అడిగారు. కొంతమంది విద్యార్థులు ఇంటి దగ్గర్నుండి తెచ్చుకుంటున్నారని, కోడిగుడ్లు మాత్రం తీసుకుంటున్నారని, కొంతమంది విద్యార్థులు బియ్యం లావుగా, మెనూ రుచికరంగా ఉండటం లేదందటూ విద్యార్థులు చెప్పాటం జరిగింది. ఏది ఏమైనప్పటికీ 460 మంది విద్యార్థులకు 100 మంది భోజనాలు చేశారని హెచ్‌ఎం రామాంజనేయులు తెలిపారు. దీనిపై మండల ప్రత్యేక అధికారి పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థులందరూ పాఠశాలలో మధ్యాహ్నభోజనాలు చేసేలా చూడాలని, ప్రత్యేక మానిటరింగ్ టీం పెట్టుకోవాలని, ఎప్పటికప్పుడు తగువిధంగా వంట ఏజన్సీతో, విద్యార్థులతో మాట్లాడుతూ నూటికి నూరుశాతం భోజనాలు చేసేవిధంగా చూడాలని కోరారు. అదేవిధంగా ఎంఈఓ గణేష్, ఎంపీడీవో బి.మహేష్ బృందం క్రోసూరులోని ఏపి మోడల్‌స్కూల్ లో మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. 480 మంది విద్యార్థులకుగాను 61 శాతం విద్యార్థులు భోజనాలు చేశారని గుర్తించారు. విద్యార్థులు నూటికి నూరుశాతం మధ్యాహ్నభోజనాలు తినేలా పర్యవేక్షణ చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ సుజన్‌కు సూచించారు.



ముగిసిన ఇంటింటి ఓటరు సర్వే

- నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి వివరాలు తెలుసుకున్న బీఎల్ఓలు
- మార్పులు, చేర్పులు, ఓటరు నమోదుకు 5,265 దరఖాస్తులు
- ఈ నెల 22 నుంచి ప్రారంభమైన పోలింగ్ కేంద్రాల రేషన్‌లైజేషన్



పట్టణంలో ఇటీవల ఇంటింటి ఓటర్ సర్వేని ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న ఆర్ఓ, సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి

సత్తెనపల్లి: రాజకీయ నాయకుల భవిష్యత్‌ను తలకిందులు చేయడంతో పాటుగా దేశ భవిష్యత్‌ను తలమానికంగా చేసే శక్తి ఓటు హక్కుకు ఉంది. అంతటి ప్రాధాన్యం కలిగిన జాబితా తప్పుల్లేని స్వచ్ఛ ఓటరు జాబితా తయారీకి సత్తెనపల్లి నియోజకవర్గంలో చేపట్టిన ఇంటింటి సర్వే ముగిసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకుఅధికారులు 'ఓటరు సంక్షిప్త సవరణ -2024 ' కార్య క్రమాన్ని నియోజకవర్గంలో నెలరోజులు నిర్వ హించారు. ఇంటింటి సర్వేలో భాగంగా జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకూ బీఎల్ఓలు ప్రతి గడపకూ వెళ్లారు. తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి వివరాలు సేకరించారు. కొత్త ఓటర్ల నమోదు, మృతుల ఓట్ల తొలగింపుతో పాటు శాశ్వత వలసదారులను గుర్తించి వారికి సమాచారం ఇచ్చి తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మార్పులు, చేర్పులు, నూతన ఓటరు నమోదు ఇలా ప్రతిదానికీ దరఖాస్తులు స్వీకరించారు. నియోజకవర్గంలో చేపట్టిన ఇంటింటి సర్వేను ఈఆర్వో, ఏఈఆర్వోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వచ్చారు.

98.20 శాతం ఇంటింటి పరిశీలన పూర్తి ....

స్వచ్ఛ ఓటరు జాబితా తయారీలో భాగంగా ఇంటింటి సర్వే పక్కాగా చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ లోతేటి ఆదేశించడంతో పాటు ఇదే అంశంపై పలుమార్లు సమీక్షించారు. ఈ క్రమంలో బీఎల్ఓలు 30 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి 98.20 శాతం కుటుంబాలను సర్వే చేశారు. యువ ఓటర్ల నమోదుకు ఫారం-6కు సంబంధించి 1,972 దరఖాస్తులు, ఓటర్ల తొలగింపు, వివాహమై మరోచోటకు వెళ్లిన వారు అక్కడ ఓటు చేర్చడానికి ఫారం -7కు సంబంధించి 1,549 దరఖాస్తులు, తప్పుల సవరణకు ఫారం-8కు సంబంధించి 1,744 దరఖాస్తులు స్వీకరించారు. అలాగే 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే వారిని నూతన ఓటర్లుగా గుర్తించి ఫారం-6 తీసుకున్నారు.

పర్యవేక్షించిన ఆర్ఓ..

ఎన్నికల సంఘం సత్తెనపల్లి నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారిని నియమించింది. దీంతో ఆమె ఇంటింటి సర్వేను ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేపట్టి పరిశీలన చేశారు. అంతేగాక అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఓటరు జాబితాకు సంబంధించి ఎలాంటి పొరపాట్లుకు తావు లేకుండా ఏఈఆర్ఓలకు సూచనలు చేస్తూ పర్యవేక్షించారు.

ప్రారంభమైన పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణ ..

ఎన్నికల కమిషన్ పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణపై కూడా దృష్టి సారించింది. ఇందులో భాగంగా అధికారులు ఈ నెల 22 నుంచి సెప్టెంబర్ 29 వరకూ నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అన్ని వసతులు సమకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. ముఖ్యంగా 1,500 మంది ఓటర్లు దాటితే మరో పోలింగ్ స్టేషన్, గతంలో పోలింగ్ స్టేషన్ యూపీ పాఠశాలలో ఉండి ప్రస్తుతం ఆ పాఠశాల జడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ అయితే దాని అప్‌గ్రేడ్ చేయడం, ఎపిక్ కార్డులు, ఎలక్టోరల్ రోల్ నంబర్ల మధ్య వ్యత్యాసాన్ని సరి చేయడం, ఓటర్ల తాజా ఫొటోలను అప్‌లోడ్ చేయడం, పోలింగ్ స్టేషన్ల సరిహద్దులు గుర్తించడం, మౌలిక వసతులైన విద్యుత్, ర్యాంప్‌ల నిర్మాణం తదితరాలను పరిశీలించనున్నారు. అవసరమైతే లొకేషన్ల మార్పు కోసం వచ్చిన ప్రతిపాదనలనూ పరిశీలిస్తారు.

> **ఇంటింటి సర్వే విజయవంతం**
>
> స్వచ్ఛ ఓటరు జాబితా తయారీలో భాగంగా నియోజకవర్గంలో చేపట్టిన ఇంటింటి సర్వే 98.20 శాతం పూర్తయ్యింది. బూత్‌లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి క్షుణంగా సర్వే చేశారు. అందరి సహకారం, సమన్వయంతో ఇంటింటి సర్వే విజయవంతంగా పూర్తి చేశాం.
>
> -బీఎల్ఎస్ రాజకుమారి, ఆర్డీఓ, సత్తెనపల్లి

నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు, పరిశీలన ఇలా...

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు	పరిశీలించిన ఓటర్లు
సత్తెనపల్లిరూరల్	75	29,102	30,454	05	59,561	59,385
సత్తెనపల్లిటౌన్	45	22,425	20,835	04	46,264	45,740
రాజుపాలెం	47	20,137	20,920	04	41,061	40,262
నకరికల్లు	63	25,684	25,729	03	51,416	49,066
ముప్పాళ్ళ	44	16,978	17,717	01	34,696	34,353
మొత్తం	274	1,14,326	1,18,655	17	2,32,998	2,28,806

నియోజకవర్గంలో సర్వే వివరాలు ఇలా....

మండలం	ఇంట్లో లేనివారు	ఇల్లు మారినవారు	మరణించిన ఓటర్లు	ఫొటోలు బ్లర్ ఓటర్లు	డబుల్ ఎంట్రీలు	సర్వే శాతం
సత్తెనపల్లిరూరల్	583	200	599	109	44	99.70
సత్తెనపల్లిటౌన్	1,665	245	393	28	38	98.87
రాజుపాలెం	1,046	44	287	63	45	98.05
నకరికల్లు	141	68	423	54	21	95.43
ముప్పాళ్ళ	358	244	470	53	29	99.01
మొత్తం	3,793	801	2,172	307	177	98.20

విలువలతో కూడిన విద్యతోనే ఉన్నత స్థానాలకు..

మండల ప్రత్యేక అధికారి యల్లా మహాలక్ష్మి



విద్యార్థినులతో మాట్లాడుతున్న యల్లా మహాలక్ష్మి

మిట్టగుడిపాడు(రెంటచింతల): కస్తూర్బా పాఠశాలల విద్యార్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని పల్నాడు జిల్లా అభివృద్ధి అధికారి, మండల ప్రత్యేక అధికారి యల్లా మహాలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మిట్టగుడిపాడు గ్రామ శివార్లోని కస్తూర్బా పాఠశాలన ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నతస్థానానికి చేరుకుంటారన్నారు. కష్టపడి అత్యున్నతస్థాయికి చేరుకున్న మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకుని వారి అడుగుజాడల్లో నడిచి మంచి పౌరులుగా సమాజంలో గుర్తింపు పొందాలన్నారు. తరగతి గదులలో బోధించే పాఠాలను ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో మీకు ఏమైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఎంఈఓ వై.శివనాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ విజయం చంద్రయాన్-3



మాదల జడ్పీఉన్నతపాఠశాలలో చంద్రయాన్ ప్రయోగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు



రైల్వేస్టేషన్ రోడ్డులో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద జాతీయ పతాకాలను ప్రదర్శిస్తున్న దృశ్యం



ఆల్ ది బెస్ట్ విక్రమ్ ఆకారంలో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు

సత్తెనపల్లి: భారతీయులు గర్వించదగ్గ విజయం చంద్రయాన్-3 అని సత్తెనపల్లి ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు అన్నారు. చంద్రయాన్ -3 విజయవంతమైన సందర్భంగా బుధవారం నారాయణ నగర సంకీర్తన ఆధ్వర్యంలో పట్టణంలోని లక్కరాజు గార్లపాడు బస్‌స్టాప్ సెంటర్లో గల గీతా మందిరం వద్ద నుంచి గడియార స్తంభం, గాంధీ చౌక్ మీదుగా రైల్వే స్టేషన్ రోడ్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. ముందుగా బాణాసంచా కాల్చారు. అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలో చంద్రుడి దక్షిణ ధ్రువం పై అడుగుపెట్టిన తొలి దేశం భారత దేశం అన్నారు. అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. ప్రతి ఒక్క భారతీయుడు గర్వించదగ్గ విషయమని, శాస్త్రవేత్తల కృషిని కొనియాడారు. సీనియర్ న్యాయవాది మర్రి వెంకటసుబ్బారెడ్డి, జేపీఎస్ శాస్త్రి, డాక్టర్ జి.శ్రీధర్, జి.కృష్ణ, అన్నం వెంకటరమణ, వాకా మహేశ్వర్ రెడ్డి, కొల్లిపాకుల బాలాజీ, దేవరశెట్టి రవికుమార్,పులికొండ శ్రీనివాసరావు, స్థానిక ప్రజలు, నారాయణ నగర సంకీర్తన సభ్యులు, తదితరులు ఉన్నారు.

'ఆల్ ది బెస్ట్ విక్రమ్'..

సత్తెనపల్లి: చంద్రయాన్-3 ద్వారా భారతదేశం గర్వించదగ్గ విజయాన్ని సాధించినందుకు ఇస్రోకు పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల యాజమాన్యం ప్రత్యేక శుభాకాంక్షలు బుధవారం తెలిపింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆల్ ది బెస్ట్ విక్రమ్ ఆకారంలో విద్యార్థులు కూర్చున్నారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. చంద్రయాన్-3కి కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

పాఠశాలల్లో..

ముప్పాళ్ళ: మండలంలోని మాదల జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు, ఎంజేపీ ఏపీబీసీడబ్ల్యూఆర్ స్కూల్ విద్యార్థినులు చంద్రయాన్-3 ప్రయోగాన్ని ప్రత్యక్షప్రసారంలో వీక్షించారు. బుధవారం జరిగిన ఈ విజయవంతమైన కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులచే వీక్షింపచేశారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని తిలకించారు. కార్యక్రమంలో పదవతరగతికి చెందిన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమరావతిలో...

అమరావతి: స్థానిక సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు చంద్రునిపై చంద్రయాన్-3 దిగే దృశ్యాలను తిలకించటానికి వీలుగా బుధవారం సాయంత్రం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఐదు గంటలనుంచి ఏడు గంటల వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులు వీక్షించారు. చంద్రయాన్- 3 విజయం సాధించడంతో విద్యార్థులు ఆనందంలో భారత్ మాతా కు జై అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. పాఠశాల ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయంలో ప్రత్యేపూజలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో బుధవారం చంద్రయాన్-3 విజయవంతమై భారత దేశకీర్తిప్రతిష్టలు ప్రపంచవ్యాప్తమవ్వాలని ఆలయ ఈఓ వేయూరి గోపినాథశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

ఎంపీపీ భూక్యా రజనీభాయ్



మాట్లాడుతున్న ఎంపీపీ భూక్యా రజనీభాయ్

అచ్చంపేట: అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి చేరవేయాలని ఎంపీపీ భూక్యా రజనీభాయ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ భూక్యా రజనీభాయ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ ఏఈ శేషప్పయ్య మాట్లాడుతూ మండలంలో 17 సచివాలయాలకు గాను 8 సచివాలయాలు బేస్ లెవెల్‌రాగా, 6 పూర్తయినట్లు చెప్పారు. ఎంపీ నిధులు రూ.35లక్షలతో నిండుజర్లలో కమ్యూనిటీ హాలు నిర్మించామన్నారు. రు.2కోట్ల డీఎంఎఫ్ నిధులతో 10 పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమర్ ఖాన్ మాట్లాడుతూ జగనన్న కాలనీలలో 10 లేఅవుట్లలో మంచినీటి పైపు లైన్లు వేసినట్లు చెప్పారు. మండలంలో జలజీవన్ మిషన్ కింద రూ.14కోట్లతో 6 గ్రామాలలో ఇంటింటికి కుళాయిలు వేశామన్నారు. వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 17 రైతు భరోసా కేంద్రాలలో రైతులకు కావలసిన ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. రైతులంతా తమ పంటలను ఈ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ 62 ప్రభుత్వ పాఠశాలలో 6619 జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. నాడు-నేడు ఫేజ్ 2 కింద వివిధ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో 15 అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి, ఈవోపీఆర్డీ వీర్రాజు మాట్లాడారు. గింజుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించాలని ఎంపీటీసీ స్వర్ణమ్మ భాయ్ కోరారు. గైర్హాజరైన అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు కోరారు. ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రాము బంగారం కూడా నష్టం జరగనీయం


- సీజీజీబీ రీజనల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్ హామీ
- ఆందోళన విరమించిన ఖాతాదారులు



బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

దొడ్లేరు(క్రోసూరు): గ్రాము బంగారం కూడా ఖాతాదారులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని సీజీజీబీ రీజనల్ బ్యాంకు మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్ బుధవారం ఖాతాదారులకు హామీ ఇచ్చారు. దొడ్లేరు గ్రామంలో దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణబ్యాంకులో చోటుచేసుకున్న తనఖా బంగారం అవతవకలపై త్వరగా న్యాయం చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఖాతాదారులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. దీనిపై ఎస్ఐ పాల్‌రవీందర్ చొరవతో నరసరావుపేట బ్యాంకు రీజనల్ మేనేజర్ సీహెచ్‌సీ శ్రీనివాస్‌ను పిలిపించి ఖాతాదారులకు స్పష్టమైన హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. ఈసందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ బ్యాంకులో తనఖా బంగారంపై అవతవకలు చోటుచేసుకుని పదిరోజులు గడుస్తున్నప్పటికీ బ్యాంకు అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవటంతో రాస్తారోకో చేపట్టామని, ఉన్నతాధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అక్కడికి చేరుకున్న రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారుల బంగారం ఒక్క గ్రాము కూడా నష్టపోకుండా చూస్తామని హామీ ఇచ్చారు. బ్యాంకులో పనిచేసిన గోల్డ్ అప్రైజర్ ఉద్దేశ్వపూర్వకంగా బంగారం అవతవకలు పాల్పడ్డాడని, దీనికి సహకరించిన బ్యాంకు ఇతర అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. బ్యాంకులో తనఖా పెట్టిన ఖాతాదారుల బంగారం రికార్డులు పరిశీలించేందుకు సిబ్బందిని పెంచటం జరగుతుందని అన్నారు. ఖాతాదారులు తమ బంగారానికి నగదు చెల్లించినప్పటికీ రశీదు లేదా బంగారం వస్తువులు చెల్లించకున్నా పరిశీలించి తప్పక న్యాయం చేస్తామని రీజనల్ మేనేజర్ తెలిపారు. సీఐటీయూ నాయకులు గంజిమాల రవిబాబు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిసెట్టి హనుమంతరావు, నాయకులు సంజీవరావు, పాశం ఆంజినేయులు, పెద్ద శ్రీనివాసరావు, గారపాటి సుభాని, పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు ఉండాలి



బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న ప్రత్యేక అధికారి సుధాకర్, ఎంఈఓలు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు-నేడు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సత్తెనపల్లి మండల ప్రత్యేక అధికారి సుధాకర్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నాడు-నేడు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఐఎఫ్‌పీ టాబ్లెట్లు ఏపీ విద్యార్థులకు అవసరమో ఇచ్చి యాప్‌లో సకాలంలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆయనతోపాటు మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి-2 ఎ.రాఘవేంద్ర రావు ఉన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కోలాటం నిర్వహిస్తున్న మహిళలు

రాజుపాలెం: మండలకేంద్రంలోని రాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, భజనలు బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా యాగశాలలు, శాంతిపాఠం, నిత్యపూర్ణాహుతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు. దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకట రమణసుబ్బారావులు తీర్థప్రసాదాలు భక్తులకు అందించారు. భజనాకార్యక్రమాలు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం కంటెపూడి వారిచే కోలాటం నిర్వహించగా చూపరులను ఆకట్టుకుంది. మాస్టర్స్ సీహెచ్ నరసింహారావు, బెల్లంకొండ మస్తానమ్మలు గానంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకట రమణసుబ్బారావు, కార్యదర్శి పొత్తూరి శ్రీనివాసరావులు కోలాటం వేసిన మహిళలకు గొడుగులను, చెక్కును అందజేశారు. మంగళవారం రాత్రి ప్రదర్శించిన శ్రీకృష్ణరాయభారం పద్య నాటకం భక్తులను ఆకట్టుకుంది. కళాకారులను ట్రస్ట్ చైర్మన్ సత్కరించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

సత్తెనపల్లి: పౌర్ణమి పురస్కరించుకొని సత్తెనపల్లి పరిసర ప్రాంత ప్రయాణికులకు, యాత్రికులకు అరుణాచలేశ్వర స్వామి దర్శనం, గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేక అల్ట్రా డీలక్స్ బస్ సర్వీస్ ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ జి.ఎస్.వి.వి.కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పౌర్ణమి సందర్భంగా ఈనెల 30న మధ్యాహ్నం 3 గంటలకు సత్తెనపల్లి నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. సెప్టెంబర్ 1న తిరిగి సత్తెనపల్లి చేరుతుందన్నారు. రాను, పోను చార్జీ రూ.1,900 నిర్ణయించడం జరిగింద న్నారు. అలాగే ఈ నెల 25న సత్తెనపల్లి నుంచి అరకు వ్యాలీకి రాత్రి 8 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్ నడుపుతున్నామన్నారు. విశాఖపట్నం మీదుగా టైడా జంగిల్ బెల్స్, బొర్రా గుహలు, గాలికొండ వ్యూపాయింట్, అనంతగిరి కాఫీ ప్లాంటేషన్, అరకు వ్యాలీ, పద్మాపురం గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం, అరకు నందు ఆ రాత్రి బస చేసి మరుసటి రోజు ఉదయం విశాఖపట్నం చేరి కైలాసగిరి, ఆర్కే బీచ్ మీదగా సింహాచలం దర్శనం అనంతరం బయలుదేరి 28న ఉదయం సత్తెనపల్లి చేరుతుందన్నారు. దీనికి రాను పోను చార్జి రూ.2,800 నిర్ణయించడం జరిగింద న్నారు. ప్రయాణికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.